ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

శుక్రవారం 29 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm

# ఇథనల్ ఫ్యాక్టరీకి తలసానికి సంబంధం లేదు

## పుట్టాసుధాకర్ స్పష్టీకరణ

## గతంలోనే కేంద్రం నుంచి అనుమతులు

## కొందరు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని వెల్లడి

హైదరాబాద్ , కడప : నిర్మల్ జిల్లా.. ఇథనల్ ఫ్యాక్టరీతో తలసాని కుటుంబానికి సంబంధం లేదని టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. అలాగే బీఆర్ఎస్కు కూడా సంబంధం లేదన్నారు. ఈ ఫ్యాక్టరీకి సంబంధించి కేంద్రం గతంలోనే అనుమతులిచ్చిందన్నారు. అనుమతులంటే ఎక్కడైన వ్యాపారం చేసుకోవచ్చన్నారు. పరిశ్రమలను వ్యతిరేకించడం సరికాదని అన్నారు. దీనిపై కొందరు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. పీఎంకే మా కుటుంబ సంస్థ అని వెల్లడించారు. ఫ్యాక్టరీ ఇక్కడ కాకుంటే ఒడిశా, కర్ణాటక, ఆంధ్రలో పెడతామన్నారు. ఏ పార్టీ సపోర్టు అవసరం లేదన్నారు. రాజకీయానికి ఈ ఫ్యాక్టరీకి ఎలాంటి సబంధం లేదన్నారు. ఓన్లీ బిజినెస్, అభివృద్ధి అని పుట్టా సుధాకర్ తెలిపారు.



# జమిలి ఎన్నికలొస్తాయి..

# కేసీఆర్ మళ్లీ సీఎం..

## మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

వరంగల్ : మాజీ మంత్రి యర్రబెల్లి దయాకర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జమిలి ఎన్నికలు రాబోతున్నాయని కేసీఆర్ మళ్లీ సీఎం కాబతోతున్నారు. కాంగ్రెస్కు ఓటు వేసినందుకు ప్రజలు బాధ పడుతున్నారని అన్నారు. అప్పుడు ఎమ్మెల్యేలు రిజైన్ చేస్తే సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయని దుర్మార్గుడు అని అన్నారు. అట్లాంటి వ్యక్తి నేడు తెలంగాణ గురించి గొప్పగా మాట్లాడుతున్నాడన్నారు. తొందర్లోనే జమిలి ఎన్నికలు వస్తున్నాయి కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండండి అని చెప్పారు. కేసీఆర్ ను వదులుకున్నామని ఈరోజు ప్రజలు బాధపడుతున్నారన్నారు.



## లగచర్ల భూ సేకరణ

# నోటిఫికేషన్ ఉపసంహారణ

### రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గిన ప్రభుత్వం

హైదరాబాద్: వికారాబాద్ జిల్లా లగచర్ల భూసేకరణ నోటిఫికేషన్ను ప్రభుత్వం ఉపసంహారించుకుంది. ఫార్మా విలేజ్ల కోసం ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్ను ఉపసంహారిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. లగచర్లలోని 580 మంది రైతులకు చెందిన 632 ఎకరాల భూసేకరణ నోటిఫికేషన్ను ప్రభుత్వం ఉపసంహారించుకుంది. ఆగస్టు 1న తెలంగాణ ప్రభుత్వం ఈ నోటిఫికేషన్ను జారీ చేసింది. ఫార్మా రిశ్రమల ఏర్పాటుకు స్థల సేకరణ నిమిత్తం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో నిర్వహించ చేపట్టిన గ్రామసభ రణరంగాన్ని తలపించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. భూసేకరణకు వ్యతిరేకంగా స్థానిక రైతులు గత కొంతకాలంగా నిరసనలు కొనసాగిస్తున్నారు.

### రణరంగం

ఈ క్రమంలో ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామసభ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కలెక్టర్ సహా ముఖ్య అధికారులు అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కొడంగల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ(కడా) ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డిలపై ఆయా గ్రామాల రైతులు కర్రలు, రాళ్లతో దాడులకు యత్నించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ త్రుటిలో తప్పించుకోగా కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను తప్పించేందుకు యత్నించిన డీఎస్పీ శ్రీనివాస్రెడ్డి పైనా దాడి జరిగింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్రెడ్డి సహా పలువురిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. మరోవైపు ఈ ఘటనపై అధికార, విపక్షాల మధ్య మాటలయుద్ధం కొనసాగింది. ఈ పరిణామాల నేపథ్యంలో లగచర్ల భూ సేకరణ నోటిఫికేషన్ను ప్రభుత్వం ఉపసంహారించుకుంది.






## కేసీఆర్ పేరు కాదు..

# తెలంగాణ పోరు



### అధికారం నీ దగ్గర ఉండొచ్చు.. ప్రజల అభిమానం కేసీఆర్కే

### మీ పాలనపై ఎక్కడైనా సరే చర్చిద్దాం రండి

### హాస్టల్లో భోజనం చేస్తున్న విద్యార్థులు ఆస్పత్రి పాలవుతున్నారు

### ఏడాది పాలనపై విజయోత్సవాలు సిగ్గచేటు : మాజీ మంత్రి కేటీఆర్

(హైదరాబాద్ )

బీఆర్ఎస్ పార్టీకి పునర్జన్మ ఇచ్చింది కరీంనగర్ అని మాజీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితికి జన్మస్థలం కరీంనగర్ అని తెలిపారు. కరీంనగర్ జిల్లా అలుగునూరు చౌరస్తాలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలోని పరిస్థితుల కారణంగా మరోసారి పోరాట బాట పట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కృషి అనన్య సామాన్యమైనది. పదవులు ఆశించకుండా తెలంగాణ కోసం కృషి చేశారు. కేసీఆర్ అనేది పేరు కాదు.. తెలంగాణ పోరు. కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ సాధించాం ఆనాడు ఉద్యమంలో అడ్రస్ లేని వాళ్లు ఇవాళ తెలంగాణ గురించి మాట్లాడుతున్నారు. ఆనాడు ఉద్యమంలో మన మీదకు తుపాకీ తీసుకొచ్చినోడు ఇవాళ మాట్లాడుతున్నాడు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే మీరు నాంపల్లి దర్గా దగ్గర అడుక్కుతినే వాళ్లని తెలంగాణ ప్రజల గురించి మాట్లాడుతున్నారు అని మండిపడ్డారు.

### గులాబీ జెండాకే అభిమానం..

రేవంత్ రెడ్డి ఇవాళ అదృష్టవంతుడు అధికారం ఆయన దగ్గర ఉంది. అధికారం నీ దగ్గర ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల అభిమానం మాత్రం కేసీఆర్కు, గులాబీ జెండాకే ఉంది. ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అరచేతిలో వైకుంఠం చూపించారు. దొంగ మాటలు, నంగనాచి కబుర్లు చెప్పి నువ్వు గెలవచ్చు కానీ.. ఏ రోజుకైనా తెలంగాణ చరిత్ర రాసిన రోజు కేసీఆర్ హిమాలయ పర్వతమంతా ఎత్తులో ఉంటే కనీసం ఆయన కాలి గోటికి కూడా సరిపోని పాత్రలో ఉంటావనేది అక్షర సత్యం. దమ్ముంటే నీ ఏడాది పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకునేందుకు రాష్ట్రంలోని ఏ ఊరికైనా, ఏ తండాకైనా, ఏ బస్తీకైనా వెళ్లాదామని అని సవాలు విసిరారు. కాంగ్రెస్ ఏడాది పాలనతో తెలంగాణలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేరు. ఆఖరకు గురుకులాల్లో ఉండే పిల్లలు కూడా ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చింది. హాస్టల్ లో బువ్వ తిని ఆస్పత్రి పాలయ్యే పరిస్థితి ఉంది. హాస్టల్ విద్యార్థులు తిండి కోసం అలమటిస్తున్నారు. ఇది ఏడాది పాలనలో రాష్ట్ర పరిస్థితి అని అన్నారు. ఈ పాటి దానికి విజయోత్సవాలు చేసుకుంటున్నారు. వచ్చే నాలుగేళ్లు ప్రజల పక్షాన ఉద్యమిద్దాం అని బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు.

# ఖర్గే అధ్యక్షతన సీడబ్ల్యూసీ సమావేశం

### అగ్రనేతలు రాహుల్, ప్రియాంక, ఇతర ముఖ్య నేతలు హాజరు

### తెలంగాణ నుంచి పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి



న్యూఢిల్లీ : ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అధ్యక్షతన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమైంది. రాహుల్, ప్రియాంక గాంధీ, ఇతర సీనియర్ నేతలు హాజరయ్యారు. సీడబ్ల్యూసీ సమావేశంలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. పార్లమెంట్ లో వ్యవహరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారు. ఇటీవల విడుదలైన మహారాష్ట్ర, జార్ఖండ్ ఫలితాలపై కూడా చర్చించనున్నారు. లోక్ సభ స్థానాలు 100 కు పైగా స్థానాలు సాధించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాల్లో మాత్రం ఫలితాలు సాధించలేకపోతుంది. దీనికి అనుసరించాల్సిన వ్యూహం గురించి అనుసరించాల్సిన పద్ధతులపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను చేపడుతున్నా గానీ ఫలితాలు రాబట్టుకోవడంలో ఎందుకు విఫలమవుతోంది. స్థానికంగా బలమైన నాయకత్వం లేకపోయిందని అంశంపై సుదీర్ఘంగా చర్చించబోతున్నట్లు సమాచారం. వాటితోపాటు అదానీ వ్యవహారం, అనుసరించాల్సిన వ్యూహం మేరకు కార్యాచారణ రూపొందించాలని భావిస్తుంది.

# రైతుబంధు కంటే బోనస్ బాగుంది

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్ : రైతుబంధుపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. రైతుబంధు కంటే బోనస్ బాగుందని రైతులు అంటున్నారని అన్నారు. రూ.15 వేల వరకు బోనస్ వస్తుందని చెబుతున్నారని చెప్పారు. ఏది రైతుకు మేలు అనుకుంటే అదే చేస్తాం అని తుమ్మల స్పష్టం చేశారు. పదవులు, ఓట్ల కోసం మేం పనిచేయబోమని వెల్లడించారు.



# ఘోర రోడ్డు ప్రమాదం

### మహారాష్ట్రలో.. 10 మంది మృతి

### 30 మందికి గాయాలు

ముంబై : మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భండారా నుంచి గోండియా వెళ్తున్న ప్రయాణికుల బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. 10 మంది ప్రయాణికులు మృతిచెందగా.. మరో 30 మంది వరకు గాయపడ్డారు. ఈ మధ్యాహ్నం భండారా నుంచి బయల్దేరిన బస్సు కోహ్మారా హైవేపై వెళ్తుండగా ఉన్నట్టుండి ఓ ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చింది. దాని తప్పించే క్రమంలో డ్రైవర్ ఒక్కసారిగా బస్సును ఇంకోవైపునకు తిప్పడంతో బోల్తా పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చి సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.